
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 17 ఫిబ్రవరి 2024





రాజుపాలెం ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న సూర్యనారాయణస్వామి

నేటి నుంచి శంఖారావం

ఉమ్మడి జిల్లాలో ప్రారంభం కానున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పర్యటన

- తొలిరోజు పురుషోత్తపురం, చిట్టివలసల్లో సభలు
- 18న అప్పుఘర్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గోపాలపట్నంలలో...
- 19న బిర్లా జంక్షన్, గాజువాక లంకా మైదానంలో...



విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' పేరుతో చేపట్టిన యాత్ర శనివారం నుంచి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రారంభం కానున్నది. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు పెందుర్తి నియోజకవర్గం పురుషోత్తపురంలో జరిగే సభలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు భీమిలి నియోజకవర్గ పరిధిలోని చిట్టివలస జూట్ మిల్లు మైదానానికి చేరుకుంటారు అక్కడ సభ ముగిసిన అనంతరం నగరానికి చేరుకుని అప్పుఘర్ వద్ద బస చేస్తారు. 18వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాదిరాజు ప్యాలెస్ సమీపాన, రెండు గంటలకు విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో, సాయంత్రం ఐదు గంటలకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వెంకటాపురంలో నిర్వహించనున్న సభల్లో పాల్గొంటారు. ఆదివారం రాత్రి విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని బిర్లా జంక్షన్ సమీపాన గల హోండా షోరూమ్ వద్ద బస చేస్తారు. 19వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు గాజువాక లంకా మైదానంలో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగిస్తారు. తరువాత అనకాపల్లి జిల్లా పర్యటనకు బయలుదేరి వెళతారు.

గత ఏడాది నారా లోకేశ్ యువగళం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. పాదయాత్రను డిసెంబరు 18న గాజువాక వద్ద ముగించారు. 20వ తేదీన విజయనగరం జిల్లా పోలిపల్లి వద్ద నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అయితే విశాఖ జిల్లాలో గాజువాక తప్ప మిగిలిన నియోజకవర్గాల్లో, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో లోకేశ్ పాదయాత్ర జరగలేదు. ఉత్తరాంధ్రతోపాటు పాదయాత్రలో పర్యటించిన నియోజక వర్గాల్లో 'శంఖారావం' పేరుతో లోకేశ్ సభలు నిర్వహిస్తున్నారు. .

19, 20 తేదీల్లో అనకాపల్లి జిల్లాలో..

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం యాత్ర ఈనెల 19న జిల్లాలోకి ప్రవేశించనుంది. సోమవారం అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల్లో సభలు జరగనున్నాయి. 20వ తేదీన మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర కొనసాగనున్నది.

అంతా మా ఇష్టం

ఓ మంత్రి, మరో మాజీ మంత్రి మా క్లబ్‌లో సభ్యులు

- అనుమతుల్లేకుండా భవనాలు నిర్మిస్తాం
- ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకుంటాం
- మునిసిపల్ అధికారులకు నర్సీపట్నం క్లబ్ నిర్వాహకులు హెచ్చరిక
- గ్రామ కంఠం స్థలంలో యథేచ్ఛగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న టౌన్ ప్లానింగ్ విభాగం
- విద్యుత్ మీటర్లు మంజూరు చేసిన ఏఈ
- పన్ను మదింపు చేసిన రెవెన్యూ విభాగం



నర్సీపట్నం క్లబ్ స్థలంలో నిర్మిస్తున్న వాణిజ్య భవన సముదాయం

నర్సీపట్నం, ఫిబ్రవరి 16:

"అధికార పార్టీకి చెందిన మంత్రి, ప్రతిపక్షానికి చెందిన మాజీ మంత్రి మా క్లబ్‌లో సభ్యులు. స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడుకున్నాం. క్లబ్‌కు చెందిన స్థలంలో మాకు ఇష్టం వచ్చిన నిర్మాణాలు జరుపుకుంటాం. ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకుంటాం" అని నర్సీపట్నం క్లబ్ నిర్వాహక సభ్యులు, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు స్పష్టం చేస్తున్నారు. మెయిన్ రోడ్డును ఆనుకుని క్లబ్‌కు చెందిన గ్రామ కంఠం స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా వాణిజ్య భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. దీనిపై మునిసిపల్ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

నర్సీపట్నం మునిసిపాలిటీలోని గ్రామ కంఠం సర్వే నంబరు 357/3లో 55 సెంట్లు విస్తీర్ణంలో నర్సీపట్నం క్లబ్ ఉంది. గ్రామ పంచాయతీగా వున్నప్పుడు స్థానిక పెద్దలు, అధికారులు టెన్నిస్, షటిల్ వంటి ఆటలు ఆడుకోవడానికి అప్పట్లో ఈ స్థలం కేటాయించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ కంఠం స్థలాన్ని యథావిధిగా వినియోగించుకోవాలే తప్ప శాశ్వత కట్టడాలు ఏవీ నిర్మించకూడదు. కానీ క్లబ్‌లో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు సభ్యులుగా వుండడంతో అధికారులు, పోలీసులు తమ జోలికి రారన్న ధీమాతో క్లబ్ నిర్వాహకులు తమ ఇష్టం వచ్చినట్టు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కాగా మెయిన్ రోడ్డు పక్కన వున్న ఈ స్థలం విలువ మార్కెట్ రేటు ప్రకారం రూ.40 కోట్లకు పైగానే వుంటుంది.

దర్జాగా వాణిజ్య సముదాయం నిర్మాణం

నర్సీపట్నం క్లబ్ స్థలంలో మునిసిపాలిటీ అనుమతులు లేకుండా అక్రమంగా వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నారు. గ్రామ కంఠంలో భవనాలు నిర్మించడం ఒక నేరమైతే, మునిసిపల్ అనుమతులు లేకుండా ఏకంగా వాణిజ్య సముదాయం నిర్మించడం మరో నేరం. అయితే క్లబ్‌లో సభ్యులుగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు వుండడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్లబ్ స్థలంలో అక్రమ నిర్మాణంపై పౌరుల నుంచి విమర్శలు రావడం మునిసిపాలిటీ అధికారులు జనవరి 31న సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ ద్వారా ప్రొవిజనల్ ఆర్డర్ నోటీసు ఇచ్చారు. మళ్లీ ఈ నెల 8వ తేదీన కన్ఫర్మేషన్ ఆర్డర్ నోటీసు ఇచ్చారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేయడం నేరమని, తక్షణమే పనులు ఆపాలని సూచించారు. అయినా నిర్మాణ పనులు ఆపకపోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వర్లు స్వయంగా క్లబ్ సభ్యులను కలిసి చెప్పినా లెక్కచేయలేదు. పైగా నర్సీపట్నం క్లబ్‌కు చెందిన ఒక సభ్యుడి నుంచి టౌన్ ప్లానింగ్ అధికారికి బెదిరింపులు వచ్చినట్టు తెలిసింది. జిల్లాకు చెందిన ఒక మంత్రి, మరో మాజీ మంత్రి తమ క్లబ్‌లో సభ్యులని, తమ జోలికి వస్తే బాగోదని హెచ్చరించినట్టు సమాచారం. భవన నిర్మాణాన్ని ఆపేది లేదని, ఏదైనా ఉంటే కోర్టులో తేల్చుకుంటామని, తమ క్లబ్ జోలికి వచ్చి ఇబ్బంది పడవద్దని బెదిరించినట్టు తెలిసింది.

అక్రమ నిర్మాణం నేరం

మునిసిపాలిటీ అనుమతులు లేకుండా భవనాలు నిర్మించడం చట్టరీత్యా నేరమని టీపీవో చెబుతున్నారు. ప్లాన్ లేకుండా నిర్మాణం చేపడితే నిబంధనల ప్రకారం తొలుత ప్రొవిజనల్ ఆర్డర్ నోటీసును సదరు భవన యాజమానికి ఇస్తారు. అనుమతులు పత్రాలు ఉంటే తీసుకొచ్చి చూపించాలని, అప్పటి వరకు పనులు ఆపాలని చెబుతారు. అయినాసరే పనులు ఆపకపోతే ఏడో రోజున కన్ఫర్మేషన్ ఆర్డర్ నోటీసు ఇస్తారు. తర్వాత ఏడు రోజులకు మూడో నోటీసు ఇస్తారు. అక్రమ నిర్మాణం కూల్చివేత/ సీజ్ చేయడం/ కోర్టులో చార్జిషీట్.. ఈ మూడింటిలో ఏదో ఒకటి అమలు చేస్తారు. వాస్తవంగా పునాదుల స్థాయిలోనే అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయవచ్చు. కానీ రాజకీయ ప్రముఖులు క్లబ్‌లో సభ్యులుగా వున్నారని నిర్వాహకులు బెదిరింపు ధోరణిలో చెప్పడంతో

... మిగతా 8వ పేజీలో

నమో: సూర్యనారాయణ

ఘనంగా రథసప్తమి వేడుకలు

రథసప్తమి పర్వదినం సందర్భంగా శుక్రవారం అనకాపల్లి మండలం రాజుపాలెంలోని సూర్యనారాయణస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకోవడానికి తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకులు కల్యాణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాధారణ భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. మంత్రి గుడివాడ అమర్, ఎంపీ డాక్టర్ సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, టీడీపీ నేతలు పీలా గోవింద, పప్పల చలపతిరావు, జనసేన నాయకుడు పరుచూరి భాస్కరరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామివారిని రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. - అనకాపల్లి రూరల్

విశాఖలో ఐపీఎల్ మ్యాచ్‌లు?

- ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి

-7లో

కొత్తకోటలో వైసీపీ నేతల దందా

గ్రామ పంచాయతీ స్థలం కబ్జా

పాలకవర్గం అనుమతి లేకుండా దుకాణాల నిర్మాణం

- సొంత స్థలంగా భావిస్తూ శాశ్వత కట్టడాలు
- చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు




కొత్తకోటలో మార్కెట్ స్థలంలో చేపట్టిన షాపు నిర్మాణం

రావికమతం, ఫిబ్రవరి 16:

మండలంలోని కొత్తకోటలో పంచాయతీకి చెందిన మార్కెట్ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు ఆక్రమించుకున్నారు. అంతటితో ఆగకుండా దర్జాగా దుకాణాలు నిర్మిస్తున్నారు. కబ్జాదారులు వైసీపీ నేతలు కావడంతో అడ్డుకోవడానికి పంచాయతీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

ప్రధాన రహదారి పక్కన గ్రామ పంచాయతీకి చెందిన ఈ స్థలాన్ని ఇటీవల పంచాయతీ అధికారులు అభివృద్ధి చేసి మార్కెట్‌ను అక్కడికి తరలించారు. నాబార్డు నిధులతో రెండు షాపులు నిర్మించారు. ఇందులో వ్యాపారాలు బాగా సాగుతుండడంతో మిగిలిన స్థలంపై అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. పంచాయతీ వార్డు సభ్యురాలి భర్త, మరో ముగ్గురు కలిసి షాపుల నిర్మాణం చేపట్టారు. పంచాయతీ తీర్మానంగానీ, బహిరంగ వేలం పాటగానీ నిర్వహించకుండా, తమ సొంత స్థలంగా భావిస్తూ శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు.



పంచాయతీ స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డు

ఈ సందర్భంగా తెలుగుదేశం, బీజేపీ నాయకులు కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, వెల్లంకి ఈశ్వరావు, ఎం.శ్రీను తదితరులు మాట్లాడుతూ, పంచాయతీ ఒకటో వార్డు సభ్యురాలు సీతిన శ్రావణి భర్త గిరి, చేపల వ్యాపారి నక్కా అప్పారావు,పెంటకోట రాము, కొశిరెడ్డి సర్వ కలిసి పంచాయతీ స్థలంలో అక్రమ నిర్మానాలు చేపడుతున్నారని ఆరోపించారు. దీనిపై మండల పరిషత్ ఏవోకి శుక్రవారం ఫిర్యాదు చేశామన్నారు. పంచాయతీ స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని, దీనిపై తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా పంచాయతీ స్థలంలో అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు షాపులు నిర్మించడంపై పంచాతీయ ఈవో కృష్ణమోహన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అనారోగ్యం కారణంగా సెలవులో వున్నానని, ఈ సమయంలో పంచాయితీ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. తక్షణమే వాటిని తొలగిస్తామని తెలిపారు.



అచ్యుతాపురంలో నాగబాబు నివాసం ఉండబోతున్న గృహం

అచ్యుతాపురంలో నాగబాబు నివాసం

- సిబ్బంది కోసం పక్కనే మరో పది గృహాలు అద్దెకు
- అనకాపల్లిలో పార్టీ జిల్లా కార్యాలయం
- అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి నాగబాబు పోటీ చేయనున్నారని సమాచారం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 16:

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అచ్యుతాపురంలో నివాసం ఉండడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఇల్లు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అచ్యుతాపురం నుంచి గాజువాక వెళ్లే రహదారిలో రామన్నపాలెం వద్ద జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్ ఇటీవల నూతనంగా గృహాన్ని నిర్మించుకున్నారు. ఈ భవనం కింద భాగంలో నాగబాబు నివాసం ఉండడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా ఎస్‌టీబీఎల్ లేఅవుట్‌లో సుమారు పది గృహాలను అద్దెకు తీసుకున్నారు. ఎన్నికల కార్యకలాపాలన్నీ అచ్యుతాపురం కేంద్రంగా నిర్వహించాలన్న ఉద్దేశంతోనే నాగబాబుతోపాటు ఇతర సిబ్బంది ఉండడానికి పది ఇళ్లను అద్దెకు తీసుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా జనసేన పార్టీ జిల్లా కార్యాలయం ఏర్పాటుకు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఒక భవనాన్ని ఎంపిక చేశారు.చోడవరంలో ఒక విద్యా సంస్థను నిర్వహిస్తున్న ఈ భవన యజమాని కొంతకాలం క్రితం జనసేన పార్టీలో చేరారు.

పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు!

ఎన్నికల నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు

- పలు శాఖల అధికారులతో కలెక్టర్ ఇప్పటికే సమీక్ష
- పరీక్షా కేంద్రాల్లో సదుపాయాల పరిశీలన
- విద్యుత్, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లకు ప్రాధాన్యం
- 38 కేంద్రాల్లో ఇంటర్, 108 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు



ఎలమంచిలి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డీవీఈఓ సుజాత, ఇతర అధికారులు

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇటు సాధారణ ఎన్నికలు, అటు పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈసారి ఇంచుమించుగా ఒకే సమయంలో జరగనుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి.. జిల్లా విద్యా శాఖాధికారులు, పోలీసు, విద్యుత్, ఆర్టీసీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, ఏ శాఖ.. ఏయే పనులు/ ఏర్పాట్లు చేయాలన్నదానిపై స్పష్టత ఇచ్చారు. జిల్లా ఇంటర్మీయట్ అధికారి(డీవీఈఓ) సుజాత, జిల్లా విద్యా శాఖాధికారి (డీఈవో) ఎంవీ లక్ష్మమ్మ ఆయా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తూ, విద్యార్థులు ఎటువంటి ఇబ్బంది పడకుండా పరీక్షలు రాసేందుకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలిస్తు న్నారు. ప్రధానంగా విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటివాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ పనుల బాధ్యతలను ఆయా కేంద్రాల ప్రిన్స్‌పాళ్లు/ ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. అన్ని కేంద్రాల్లో విద్యార్థులకు సరిపడ బెంచీలు వున్నాయా? లేదా? పరిశీలిస్తున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యా ర్థులకు సరిపడ ఫర్నిచర్ లేకపోతే, సమీపంలోని ఇతర పాఠశాలలు/ కళాశాలల నుంచి సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క విద్యార్థి కూడా గచ్చుపై కూర్చుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి వుండకూడదని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ నెల 21వ తేదీ నుంచి హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోచ్చని డీఐఓ సుజాత చెప్పారు.

38 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు 38 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. నిర్ణీత తేదీల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వస్తారు. ప్రశ్నా పత్రాలను పరీక్ష కేంద్రాలకు సమీపంలో వున్న 14 పోలీసు స్టేషన్‌లలోని స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరుస్తారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 13,323 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 15,298 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

పది పరీక్షలకు 108 కేంద్రాలు....

మార్చి 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో 108 కేంద్రాలను అధికారులు ఎంపిక చేశారు. 21,259 మంది రెగ్యులర్, 2,324 మంది ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 23,583 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

కదంతొక్కిన కార్మికులు, రైతులు

- కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీలు

(ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్)

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదంటూ శుక్రవారం 'పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌'కు అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వామపక్షాలు, రైతు, కార్మిక సంఘాలు నిరసన ర్యాలీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రుణమాఫీ అమలు చేయాలని, ఎరువులు, పురుగు మందులను సబ్సిడీపై అందజేయాలని, కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అనకాపల్లిలో సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వ విధానలను రైతుల వెన్ను విరుస్తున్నాయని విమర్శించారు. నర్సీపట్నంలో సీబీఎం కాంపౌండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సి అవసరం అందరిపైనా ఉందని అన్నారు. చోడవరంలో ర్యాలీ నిర్వహించి కొత్తూరు జంక్షన్‌లో రాస్తారోకో చేపట్టారు. రైతులకు, కార్మికులకు అన్యాయం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం గద్దె దిగాలని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో కొత్తగా తీసుకువచ్చిన చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనను అణదొక్కేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు.



నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాలు, కార్మిక సంఘాలు

ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలు: కలెక్టర్

-7లో

క్రైం... crime news

వ్యాన్, కారు ఢీ: నలుగురికి తీవ్ర గాయాలు



రేగుపాలెం జంక్షన్‌లో వ్యాన్, కారు ఢీకొన్న దృశ్యం

ఎలమంచిలి, ఫిబ్రవరి 16: మండలంలోని రేగుపాలెం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం వ్యాను, కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే రేగుపాలెం జంక్షన్ వద్ద వ్యాన్ అనకాపల్లి వైపు వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటుండగా అదే సమయంలో అనకాపల్లి నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి వచ్చి వ్యాన్‌ని ఢీకొట్టినట్టు హైవే పోలీసులు తెలిపారు. క్షతగాత్రులు మునగపాక నుంచి కాకినాడ వెళుతుంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మునగపాక మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన బి.మనోహర్, బి.మూర్తి, బి. తారకేశ్వరావు మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో హైవేపై కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే హైవే పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది, ఎన్‌హెచ్ 16 సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 16: పరవాడ గ్రామంలో పాన్‌షాపులో మద్యం అమ్మకాలు సాగిస్తున్న చుక్క దేవిపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి సిబ్బందితో తనిఖీ చేయగా 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నిలిచిన పవర్ ప్లాంట్ పనులు

- వైసీపీ వర్గ పోరే కారణం


ప్లాంట్ స్థలం వద్ద వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 16: సెజ్‌లో 400 మెగావాట్ల పవర్ ప్లాంట్ పనులు వైసీపీ నాయకుల వర్గపోరు కారణంగా నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళ్తే...సెజ్‌లో 400 మెగావాట్ల విద్యుత్ సరఫరా కేంద్రానికి సంబంధించి భూమి చదును పనులు ప్రారంభమయ్యాయి. దీనికి కావలసిన గ్రావెల్ కాంట్రాక్టు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వర్గానికి రూ.4 కోట్లకు వచ్చింది. వీరు అన్ని అనుమతులతో గ్రావెల్‌తో భూమి చదును చేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే కన్నబాబు రాజు వర్గీయులు పనులను అడ్డుకుంటున్నారు. సెజ్ పునరావాస కాలనీకి ఆనుకొని పనులు జరుగుతున్నాయి కనుక తమకు కాంట్రాక్టు ఇవ్వాలంటూ పేచీకి దిగారు. బిడ్ వచ్చినందున పనులు చేస్తున్నామంటూ మంత్రి వర్గీయులు పేర్కొంటున్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయి.

అప్పన్న సన్నిధిలో వైభవంగా సూర్య జయంతి

సింహాచలం, ఫిబ్రవరి 16: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సూర్య జయంతిని శుక్రవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఆలయంలో ఈశాన్య దిక్కున బేడా మండపంలో రాతి రథంపై అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో అర్చకులు ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. పండితులు అరుణ పారాయణం చేస్తుండగా పంచామృతాలతో, పవిత్ర గంగధార జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని సర్వ స్వర్ణాభరణాలతో, పలు పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి మంత్రపుష్పం, మంగళాశాసనం, మంగళనీరాజనాలతో ఉత్సవం పూర్తి చేశారు. సాయంత్రం 5 గంటలకు గోవిందరాజస్వామిని సూర్యభగవానుడిగా ఉషా, ఛాయదేవి సమేతంగా వాహనంపై మాడవీధుల్లో తిరువీధి వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసమూర్తి, ఏఈఓ భ్రమరాంబ, పాలకమండలి పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమా విజయం సాధించింది

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కోర్టు తీర్పుతో పటాపంచలు అయ్యాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు చెప్పారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని విషయంలో జగన్‌రెడ్డి చేసిన విష ప్రచారం, అమరావతి విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్టు సినిమాలో చూపించారన్నారు. ప్రభుత్వ టెర్రరిజం చేసిన విధ్వంసం ఈ సినిమా ద్వారా అందరికీ చేరుతుందన్నారు. వేల కోట్ల ప్రభుత్వ సంపదను ఒక సైకో ఎలా నాశనం చేశాడో.. మహిళలు, రైతుల పట్ల ఎంత దారుణంగా వ్యవహరించాడోనన్న నిజాలు ఈ సినిమా ద్వారా ప్రజల్లోకి వెళతాయని చెప్పారు. దీంతో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు మొదలైందన్నారు. సినిమాపై తప్పుడు ఆరోపణలతో సొంత పార్టీ నేతల ద్వారా కేసులు వేయించారని, అడుగడుగున సినిమాను అడ్డుకునేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. అయితే చివరకు న్యాయమే గెలిచిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, మళ్ల గణేష్ పాల్గొన్నారు.

ఎస్‌బీ డీఎస్పీగా అప్పారావు బాధ్యతల స్వీకారం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా బి.అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు రాజమండ్రి ఎస్‌బీ డీఎస్పీగా పనిచేసి జిల్లాకు వచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణను జిల్లా పోలీస్ కార్యాలయంలోని మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీస్ ఉద్యోగులకు గ్రీవెన్స్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : జిల్లాలో పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులకు గ్రీవెన్స్ నిర్వహించారు. క్రైమ్స్ ఏఎస్పీ సత్యనారాయణ హాజరై ఉద్యోగుల నుంచి వినతులను స్వీకరించారు. అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై ఉద్యోగులు తమ గోడును వెళ్లబుచ్చుకోగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఏఎస్పీ సత్యనారాయణ హామీ ఇచ్చారు.

స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : భారతీయ స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణాభివృద్ధి ఫైనాన్షియల్ అడ్వయిజర్ అండ్ జాయింట్ సెక్రటరీ తనూజా రాఖార్ ఖల్‌కో పేర్కొన్నారు. శుక్రవారం అనకాపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ఆమె పరిశీలించి, అభ్యర్థులతో మాట్లాడారు. శిక్షణ కేంద్రంలో వసతి, భోజన సదుపాయాలు గురించి ఆరా తీశారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వశక్తితో మహిళలంతా అభివృద్ధికి రావాలన్నదే సంస్థ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు నటరాజసై, విశ్వనాథరెడ్డి, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

నిరుపయోగంగా జాజిగెడ్డ గ్రోయిన్

- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువు
- ప్రశ్నార్థకంగా మారిన 400 ఎకరాలకు సాగు


తూటిపాలలో మరమ్మతుకు గురైన గ్రోయిన్

మాకవరపాలెం, ఫిబ్రవరి 16: మండలంలోని తూటిపాల పంచాయతీ పరిధి జాజిగెడ్డ వద్ద గ్రోయిన్ నిరుపయోగంగా మారింది. ఇది మరమ్మతుకు గురై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో సుమారు 400 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. గత నాలుగేళ్లుగా వరి సాగు చేస్తున్నప్పటికీ పొలాలకు నీరు అందకపోవడంతో పంట సరిగా పండక నష్టాలను చవిచూస్తున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న బోళం ముత్యాల పాప వద్ద రైతులు ఈ సమస్యను ప్రస్తావించడంతో ఆమె నిధులను మంజూరు చేయించి గ్రోయిన్ నిర్మాణానికి కృషి చేశారు. ఆ తరువాత వచ్చిన వరదలకు అది కొట్టుకుపోయింది. నాటి నుంచి నేటి వరకు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులను రైతులు కలిసి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఇదిలావుంటే, స్థానిక వైసీపీ నాయకులు ఎమ్మెల్యే గణేశ్ ద్వారా అనకాపల్లి ఎంపీ సత్యవతి దృష్టికి గత ఏడాది ఈ సమస్యను తీసుకు వెళ్లారు. గ్రోయిన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వేడుకున్నారు. గత ఏడాది నీటి సదుపాయం లేక వరిపంట పూర్తిగా ఎండిపోయి నష్టపోయామని రైతులు వివరించారు. ఇప్పటికైనా ఈ సమస్యపై ఎమ్మెల్యే గణేశ్ స్పందించాల్సిందిగా ఆయకట్టు రైతులంతా కోరుతున్నారు. ఈ సమస్యపై ఇరిగేషన్ జేఈ రవికుమార్‌ను వివరణ కోరగా, ప్రస్తుతం ఎంపీ సత్యవతి గ్రోయిన్ మరమ్మతుకు రూ.30లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. టెండర్లు ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో ఓపీ విభాగం ప్రారంభం


ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, ఫిబ్రవరి 16 : పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో శుక్రవారం ఓపీ విభాగం ప్రారంభమైంది. ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ ప్రత్యేకంగా ఓపీ విభాగం కోసం రూ.8.8 కోట్లతో భవనాన్ని నిర్మించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, నాలుగు మండలాల ఎంపీపీలు సుర్లరాజేశ్వరి, రుత్తల సత్యనారాయణ, గజ్జలపు మణికుమారి, సాగిన లక్ష్మణమూర్తి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడులు మిగిలిన ప్రత్యేక వైద్య విభాగాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవి తదితరులు పాల్గొన్నారు.

20 నిమిషాల్లోనే మునిసిపల్ సమావేశం ముగింపు

- 21 అంశాలపై తీర్మానాలు ఆమోదం
- కొమ్మాయి గుండం చెరువుకు సత్యంరాజు పేరు, సన్యాసమ్మ చెరువుకు తులసీరావు వనంగా నామకరణం


మునిసిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, ఫిబ్రవరి 16: ఎలమంచిలి మునిసిపల్ సమావేశాన్ని శుక్రవారం 20 నిమిషాల్లోనే ముగించేశారు. అజెండాలో 21 అంశాలు పొందుపరిచినప్పటికీ వీటిపై ఎటువంటి చర్చ కొనసాగించలేదు. ఈ అంశాలపై తీర్మానం చేసినట్టు ప్రకటించారు. కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. కీర్తిశేషులు పిన్నమరాజు సత్యనారాయణ రాజు(సత్యం రాజు) అందించిన సేవలకు గుర్తింపుగా కొమ్మాయి గుండం చెరువును రూ.86 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని, ఈ చెరువుకు సత్యనారాయణరాజు పెడుతున్నట్టు చైర్‌పర్సన్ ప్రకటించారు. అలాగే విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు సేవలకు గుర్తింపుగా సన్యాసమ్మ చెరువు ప్రాంతంలో డెయిరీ నిధులతో అభివృద్ధి చేసే ప్రాంతాన్ని తులసీరావు వనంగా నామకరణం చేసేందుకు తీర్మానం చేశారు. అలాగే కొత్తపాలెం కౌన్సిలర్ సంతోష్, గొల్లలపాలెం కౌన్సిలర్ అచ్యుతరావు విద్యుత్ మీటర్లు, తదితర సమస్యలను కౌన్సిల్ ముందుంచారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చైర్‌పర్సన్ రమాకుమారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రభాకరరావు, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, డీఈఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉప్పుటేరుకు ప్యాకేజీ ఇవ్వాలి

- ఏపీఐఐసీ అధికారులకు మత్స్యకారుల వినతి


అధికారులకు వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి, ఫిబ్రవరి 16: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో జీవనాధారమైన ఉప్పుటేరులో చేపల వేట సాగించడం కష్టమని, అందువల్ల పూర్తి స్థాయిలో పరిహారం, ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని రాజయ్యపేట మత్స్యకారులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజయ్యపేటలో ఏపీఐఐసీ భూసేకరణ డీటీ టీవీఎల్ రాజు, డీటీ కిరణ్ తదితరుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసిత మత్స్యకారులు, రైతులు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. 2013 భూసేకరణ చట్టం భూములిచ్చిన రైతులకు పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని, ఉప్పుటేరులో చేపల వేట సాగించే మత్స్యకారులకు ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. గత 50 సంవత్సరాలుగా గ్రామంలో జీడితోటలను సాగు చేసుకుంటున్న వారికి కూడా పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలంటూ వినతిపత్రం అందజేశారు. చేపల వేటకు సంబంధించి జెట్టీ ఏర్పాటు చేయాలని, టెన్త్ చదివిన విద్యార్థులందరికీ నెలకు రూ.18 వేలు జీతం ఇవ్వాలన్నారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే బల్క్ డ్రగ్, ఫార్మా, రసాయన పరిశ్రమలను ఏర్పాటు చేయకూడదని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సీపీఎం నేత అప్పలరాజు, గ్రామ పూజారులు పిక్కి దేవుడు, తాతీలు, ఎంపీటీసీ సభ్యుడు సత్తియ్య, పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, వాసుపల్లి శివ, మైలపల్లి ప్రసాద్, రాజేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలు

- జిల్లా ఎన్నికల నిర్వహణాధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఎస్పీ కేవీ మురళీకృష్ణ తదితరులు

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలను చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను అన్ని మౌలిక వసతులతో సిద్ధం చేశామని, నిర్వహణకు అవసరమైన అధికారులు సిబ్బందిని సమాయత్తం చేయడం జరిగిందని చెప్పారు. జిల్లాలోని సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా తగిన కమ్యూనికేషన్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది, వాహనాలు గస్తీ సిబ్బంది మొదలైన వాటిని క్షుణ్ణంగా పరిశీలించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్టు చెప్పారు. ఈవీఎంలపై ఓటింగ్ ఏ విధంగా చేయాలనే శిక్షణ కార్యక్రమాలు కూడా విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. వివాదాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, సీపీఓ జి.రామారావు, నర్సీపట్నం ఆర్డీఓ హెచ్‌వీ జయరాం, నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, అనకాపల్లి, చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'కి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి

- సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు



రాజాం గ్రామంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కనకారావు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 16: ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులను రూ.రెండు లక్షల కోట్లకు పెంచాలని సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షులు ఎస్.కనకారావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా మండలంలోని రాజాం గ్రామంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నానాటికీ పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, కార్మిక చట్టాలు అమలుకు నోచుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమనాథ్ సిఫార్సులను తూ.చ. తప్పకుండా అమలు చేయాలని, ఉపాధి హామీ పథకంలో రోజు కూలీ రూ.600లు ఇవ్వాలని, రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలని, ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటుపరం చేయకూడదని, అసంఘటిత కార్మికులకు సోషల్ సెక్యూరిటీ కల్పించాలని ఆయన కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలో భాగంగా తొలుత స్థానికంగా దుకాణాలు, పాఠశాలలు, వాణిజ్య బ్యాంకులను మూసివేయించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఎఫ్‌టీయూఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు నాగులాపల్లి సత్యనారాయణ, జిల్లా నాయకులు మరిసా సతీష్, నరేష్, నవభారత భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మరిసా నాగ అప్పారావు, ఎల్.శ్రీను, వ్యవసాయకూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయాలి

- తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగపూడి అనిత


నియోజకవర్గం టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 16: ఈనెల 20న కోటవురట్లలో జరగనున్న నారా లోకేశ్ ఎన్నికల శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత కోరారు. శుక్రవారం ఆమె నివాసం వద్ద నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల నుంచి ఐటీడీపీ, తెలుగు మహిళ, యువత, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, నాయకులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు. యువగళం పాదయాత్రను నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు విజయవంతం చేసినట్టే శంఖారావాన్ని కూడా విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గంలో అపరిష్కృతంగా వున్న ప్రధాన సమస్యలపై లోకేశ్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో నియోజకవర్గం టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్దం, జానకి శ్రీను, పెదిరెడ్డి చిట్టిబాబు, లాలం కాశీనాయుడు, ఏజెర్ల వినోద్ రాజు, కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, గొర్లి రాజబాబు, మజ్జూరి నారాయణరావు, గుర్రం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో కన్నుల పండువగా రథసప్తమి వేడుకలు


ఆలయం ముందు తప్పెటగుళ్లు వేస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 16: జిల్లాలోని ప్రసిద్ధి చెందిన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. స్వామివారిని దర్శించుకోవడానికి వేకువజామున మూడు గంటల నుంచి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రధాన అర్చకులు కళ్యాణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు మజ్జిగ, వాటర్ ప్యాకెట్, ప్రసాదం భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం టేకు రథంపై స్వామివారిని మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు పరుచూరి భాస్కరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

కొణతాలతో నాగబాబు భేటి



అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు శుక్రవారం విశాఖలో మాజీమంత్రి కొణతాల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర రాజకీయాలపై చర్చించినట్టు సమాచారం. నాగబాబు అనకాపల్లి టీడీపీ, జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఇద్దరూ నేతల భేటి ప్రాధాన్యతను సంతరించుకుంది.

నోటీసులతో ఉద్యమాలు ఆపలేరు

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రకాష్

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 16: ప్రజాస్వామ్యంగా చేస్తున్న ఆందోళనకు వెళ్లకూడదని నోటీసులు జారీ చేయడం వల్ల తమ ఉద్యమాలు ఆపలేరని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జీఎస్ ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాచలం పాఠశాలకు వచ్చి తనకు పోలీసులు నోటీసులు అందించడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు, నాయకులు మహిమా రావు, నానాజీ, సుభాషిణీ దేవీలకు పోలీసులు అప్రజాస్వామికంగా నోటీసులు ఇచ్చారన్నారు. జీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జరిగే కార్యక్రమాలను ప్రభుత్వం నిరంకుశంగా అడ్డుకుంటుందన్నారు. సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

విశాఖలో ఐపీఎల్ మ్యాచ్‌లు?

- ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 16: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కొన్ని మ్యాచ్‌లకు విశాఖ ఆతిథ్యమిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ టోర్నీలో భాగంగా పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా రెండు లేదా మూడు మ్యాచ్‌లు జరిగే సూచనలు ఉన్నాయి. ఇక్కడ ఆడేందుకు ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. ఇటీవల భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్‌కు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ యంత్రాంగం ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. తొలుత కేవలం ప్రాక్టీస్‌కు మాత్రమే వినియోగించుకోవడానికి ఆసక్తి చూపిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్రతినిధులు ఇక్కడి సదుపాయాలు చూసి మ్యాచ్‌లు ఆడాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడే రెండు మ్యాచ్‌లకు పీఎం పాలెం స్టేడియం వేదికగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే చెన్నై సూపర్‌కింగ్స్ కూడా ఇక్కడ మ్యాచ్‌లు ఆడేందుకు ఆసక్తి చూపుతోందని సమాచారం. ఐపీఎల్ షెడ్యూల్ ఒకటి, రెండు రోజుల్లో ఖరారు కానుంది. కాగా 2012లో డెక్కన్ చార్జర్స్, 2015లో సన్‌రైజర్స్ హైదరాబాద్, 2016లో ముంబై ఇండియన్స్ జట్లు ఆడిన మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా నిలిచింది.

టెన్త్ విద్యార్థినులకు పరీక్ష సామగ్రి వితరణ

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 16 : ఎలమంచిలి మండలం లైనుకొత్తూరులోని న్యూ లైఫ్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులకు అట్టలు, పెన్స్, పెన్సిల్స్ వంటి సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు రాజా కులపాటి, నీలిమ, అమెరికాకు చెందిన డెరెక్, రెనీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా లోవాంబిక ఆలయ వార్షికోత్సవం

రాంబిల్లి, ఫిబ్రవరి 16: మండలంలోని గోకివాడలోని లోవాంబిక అమ్మవారి ఆలయ మొదటి వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ నీరుకొండ శారదా, సూర్యనారాయణలు అమ్మవారికి వెండిహారాన్ని బహూకరించారు. ఎంపీపీ జి.శిరీష, జడ్పీటీసీ సభ్యులు దూళి నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు అల్లవరపు బాబ్జి అమ్మవారిని దర్శించారు.

వైభవంగా అక్కులమ్మ పేరంటాలు తీర్థం

సబ్బవరం, ఫిబ్రవరి 16: రామలమ్మపాలెంలో రథసప్తమి పురస్కరించుకొని శుక్రవారం అక్కులమ్మ పేరంటాలు తీర్థం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అక్కులమ్మకు పూజలు నిర్వహించారు. వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, మాజీఎంపీపీ ఎస్. ముత్యాల నాయుడు అమ్మవారిని దర్శించుకొని, మధ్యాహ్నం అన్నసంతర్పణను ప్రారంభించారు.

డ్రిప్ ఇరిగేషన్‌తో బహుళ ప్రయోజనాలు

కోటవురట్ల, ఫిబ్రవరి 16: డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రైతులు ఎరువుల వినియోగంపై బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని ఏపీ మైక్రో ఇరిగేషన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని తంగేడులో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఎరువుల వినియోగంపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోరుప్రోలు శివ, ఇరిగేషన్ శాఖ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయండి

సబ్బవరం, ఫిబ్రవరి 16 : వేపగుంటలో శనివారం జరిగే తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మీనాయుడు కోరారు. ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరై సభను విజయంతం చేయాలన్నారు.

ఉద్యోగుల ఆందోళన

పరవాడ, ఫిబ్రవరి 16 : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో రాంబాబు, ఫణికుమార్, చంద్రశేఖర్, సాయిరాం, పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం



అనకాపల్లి పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక, రైతు సంఘాల ప్రతినిధులు



అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



ఎలమంచిలి రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా శుక్రవారం కార్మిక, రైతు సంఘాల ప్రతినిధులు, కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతులను కుంగదీస్తుందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఆర్.దొరబాబు,బాస్కరరావు, వీవీ శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, అజయ్, బొమ్మల రాము, పలకా సత్యనారాయణ, సూర్యకళ, కె.లక్ష్మణ్, కె.శంకర్, భానుమూర్తి పాల్గొన్నారు. కాగా సమ్మె కారణంగా 35 పీటీడీ అద్దె బస్సులు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కశింకోటలో.. దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌లో భాగంగా సీఐటీయూ, ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్, అంగన్‌వాడీ, ఆశ, ఎండీఎం, ఐద్వా, ముఠా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కశింకోట పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మధుసూదనకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో సంఘ ప్రతినిధులు దాకారపు శ్రీనివాసరావు, సోమునాయుడు, తనూజ, శ్రీదేవి, పి.నాగేశ్వరరావు, నూకరాజు, భవానీ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పరవాడలో.. భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు శుక్రవారం పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఎస్.గురునాధరావు, ఆర్. కన్నబాబు, పైలా అప్పలనాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. నక్కపల్లి నూకాంబికా అమ్మవారి ఆలయం నుంచి ఉపమాక హైవే జంక్షన్ మీదుగా బస్టాండ్ హైవే జంక్షన్ వరకూ సీపీఎం, సీఐటీయూ, ఆటో రిక్షా , అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సీఐటీయూ జిల్లా ప్రతినిధి దుర్గారాణి, స్వామి, సత్యనారాయణ,నాగేశ్వరరావు, లక్ష్మిపాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. పట్టణంలో శుక్రవారం కార్మిక సంఘాలు దిమిలి రోడ్డు నుంచి బస్టాండ్ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గనిశెట్టి ఏసుదాసు, వివిధ సంఘాల నేతలు బంగారు అప్పల నాయుడు, బి.వరప్రసాద్, గణేష్, రాజు, దిగుమర్తి మహేష్, ఈరుగుల చంద్రరావు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..మండలకేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడు నాయుడు, నాయకులు రామకృష్ణ, రమణ, గణేష్, రాజు, రాము, నారాయణరావు, కార్మికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం జంక్షన్‌లో ..మండలం కేంద్రం, హరిపాలెంల్లో శుక్రవారం కార్మికులు, కమ్యూనిస్టు నేతలు ర్యాలీలు నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, నాయకులు ధర్మిరెడ్డి చిన్నబాబు, ఎస్.కామేశ్వరరావు, కర్రి అప్పారావు, కె.రామ సదాశివరావు, ఎస్.కన్నంనాయుడు, బుద్ద రంగారావు, ఆర్.రాము పాల్గొన్నారు.

మునగపాకలో.. దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, బ్రహ్మాజీ, అంగన్‌వాడీలు జయలక్ష్మి, రామలక్ష్మి, అంజలి, హేమలత, ఉమ పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లోని సూర్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. తెల్లవారుజామున స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం దాటే వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ నాయకులు, టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు దర్శించుకున్నారు. అలాగే స్థానిక గౌరీ పంచాయతన ఆలయంలో రథసప్తమి వేడుకల్లో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సూర్యనారాయణ సమేత ఉషా పద్మిని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ పాల్గొన్నారు. అలాగే వెదురుపర్తిలోని సూర్యనారాయణస్వామిని తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ శుక్రవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో కోట్ని రాము, ఆళ్ల సూరప్పారావు, కె.రమణ, అల్లవరపు లక్ష్మణరావు, రామ గోవింద, తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో..: మండల వ్యాప్తంగా శుక్రవారం రథసప్తమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పి.బోనంగిలోని ఆంజనేయస్వామి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధనను నిర్వహించారు.



సుంకరమెట్టలో స్వామివారిని దర్శించుకున్న దాడి రత్నాకర్ దంపతులు

ఎలమంచిలిలో.. రథసప్తమి పురస్కరించుకుని ఎలమంచిలి గొల్లల కొండపై ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని జనసేన పార్టీ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, దర్శించుకున్నారు. వైసీపీ పార్టీ నేత కోడిగుడ్డు రమణ బాబు, బీజేపీ నేత పప్పు ఈశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు.

పాయకరావుపేటలో.. రథసప్తమి పర్వదినాన్ని పట్టణ ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పాండు రంగస్వామి ఆలయం, రాజుగారిబీడులోని వేంకటేశ్వరస్వామి, బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు ఆలయం, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సాయి ఆదర్శనగర్‌లోని షిర్డీ సాయి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.



పాయకరావుపేట రూరల్: గోపాలపట్నం సీతమ్మవారి కొండపై మహిళలు పాలు పొంగిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని గోపాలపట్నం సీతమ్మవారి కొండపై మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పాలు పొంగించి పూజలు నిర్వహించారు. సీతమ్మవారి కొండపై భక్తులు పాలు పొంగించడం ఆనవాయితీ. కొండపైకి వచ్చిన భక్తులకు గోపాలపట్నం చెందిన గిరిస్వామి అన్నసమారాధన నిర్వహించారు.

అచ్యుతాపురం రూరల్‌లో.. మండలంలోని నునపర్తిలోని హరిహర పంచాయతన దివ్య క్షేత్రంలో శుక్రవారం ఉషా చాయా పద్మినీ సమేత సూర్యనారాయణ మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని సర్పంచ్ చుక్క అనురాధ, ఆలయ ధర్మకర్త బొజ్జా అప్పలకొండ అప్పారావు దర్శించుకున్నారు.

డిగ్రీ పరీక్షల్లో విద్యార్థులకు తీరని నష్టం

గంటన్నర సమయం కోల్పోయామని ఆవేదన

ఎలమంచిలి, ఫిబ్రవరి 16: నిబంధనల ప్రకారం మూడు గంటలు రాయాల్సిన పరీక్ష పేపరును గంటన్నర సమయానికే అధ్యాపకులు తీసుకున్నారంటూ పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎస్సెన్‌టైల్స్ పరీక్షను నిర్వహించారు. ఈ పేపరుపై పరీక్షా సమయం 3 గంటలు అని ఉన్నప్పటికీ పరీక్షా కేంద్రంలో అధ్యాపకులు గంటన్నర సమయానికే సమయం అయిపోయిందని పేపరును తీసుకున్నట్టు విద్యార్థులు వాపోయారు. ఈ విషయాన్ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళితే ఏయూ నుంచి వచ్చిన ఎస్ఈఎఫ్‌లో సమయం గంటన్నర ఉందని సమాధానం ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా ఏయూ నుంచి ఎస్ఈఎఫ్‌లో 9 గంటల నుంచి 10.30 వరకూ అని ఉందన్నారు. నిబంధనల ప్రకారమే పరీక్షను నిర్వహించామన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి : పీలా

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం తుమ్మపాలలోని ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన టీడీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. చంద్రబాబు పాలన కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఈనెల 19న నాగులాపల్లిలో జరిగే శంఖారావం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ రానున్నది టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, నాయకులు కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబి, చెక్కల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయండి

ఈనెల 19న అనకాపల్లి పట్టణంలో జరగనున్న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం కశింకోట నూకాంబిక కల్యాణ మండపంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో జగన్‌రెడ్డి చేసిన విధ్వంసం బయటపడుతుందనే రాజధాని ఫైల్స్ సినిమాను నిలిపివేశారని ఆరోపించారు. నాయకులు మురళీ, రమణమూర్తి పాల్గొన్నారు

అంతా మా ఇష్టం

... 5వ పేజీ తరువాయి

మునిసిపల్ అధికారులు మూడో నోటీసు వరకు అవకాశం ఇచ్చి కోర్టుకు వెళ్లడానికి అవకాశం కల్పిస్తున్నారు.

అక్రమ నిర్మాణానికి ఆస్తి పన్ను, విద్యుత్ మీటర్లు

నర్సీపట్నం క్లబ్ ఆవరణలో మెయిన్ రోడ్డును ఆనుకొని గత ఏడాదిఅనుమతులు లేకుండా రెండు అంతస్థులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఈ విషయం మునిసిపల్ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోలేదు. అక్రమ నిర్మాణంపై ఫైనల్ నోటీసు ఇచ్చి కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి చేతులు దులుపుకున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వకూడదు. కానీ మీటర్లు మంజూరు చేశారు. అదే విధంగా ఆస్తి పన్ను విధించకూడదు. గ్రామ కంఠం స్థలంలోని అక్రమ నిర్మాణానికి ఆస్తి పన్ను విధించడం గమనార్హం. దీనిపై మునిసిపల్ రెవెన్యూ అధికారి జి.లక్ష్మిని వివరణ కోరాగా... నర్సీపట్నం క్లబ్ నిర్వాహకులు నిర్మించిన షాపులు ప్రభుత్వ స్థలంలో ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని, పన్ను మదింపు చేయకూడదని అన్నారు. తాను రెండు నెలలు సెలవులో ఉన్నప్పుడు ఆస్తి పన్ను మదింపు చేశారని ఆమె తెలిపారు.

న్యాయ పోరాటం చేస్తాను

పాకలపాటి అరవింద్ కుమార్‌రాజు, సామాజిక కార్యకర్త, నర్సీపట్నం

నర్సీపట్నం క్లబ్ స్థలంలో భవనాల నిర్మాణపై సమాచారం కోసం గతంలో మునిసిపల్ అధికారులకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశాను. నర్సీపట్నం క్లబ్ ప్రభుత్వ స్థలంలో ఉన్నట్టు సమాధానం ఇచ్చారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మించడంపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. విద్యుత్ మీటర్లు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఈపీడీసీఎల్ ఏఈకి చెప్పాను. అయినా విద్యుత్ మీటర్లు ఇచ్చారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతున్నదని సమాధానం ఇచ్చిన మునిసిపల్ అధికారులే... దానికి ఆస్తి పన్ను మదింపు చేయడం విడ్డూరంగా ఉంది. ఇప్పుడు మళ్లీ అదే స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. హైకోర్టులో కేసు వేసి న్యాయ పోరాటం చేస్తాను.

వైభవంగా పాండురంగడి దివ్య కల్యాణం



పాండురంగస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఫిబ్రవరి 16: స్థానిక పాండురంగస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రలో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తిని గరుడ వాహనంపై ప్రతిష్ఠించి తిరువీధి, ఎదురు సన్నాహ ఉత్సవాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రధానార్చకులు కృష్ణస్వామి, నారాయణాచార్యుల ఆధ్వర్యంలో పాండురంగస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు దివ్య కల్యాణ మహోత్సవ క్రతువును అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.వెంకటాద్రి, తూములూరి వీరభద్రరావు, సిబ్బంది సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా వినోద్‌రాజు జన్మదిన వేడుకలు



వినోద్‌రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అయ్యన్నపాత్రుడు, అనిత, తదితరులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 16: మండలంలోని పెదగుమ్ములూరులో మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, పాయకరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడులు వినోద్‌రాజుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు. అలాగే నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు ఆయన అభిమానులు తరలివచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, ఎన్. వెంకటరాజు, పల్లెల జగ్గారావు, అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజయ్యపేటలో క్రికెట్ టోర్నమెంట్

నక్కపల్లి, ఫిబ్రవరి 16: మండలంలోని రాజయ్యపేటలో 2010 టెన్త్ విద్యార్థులు జగదీశ్, నూకరాజు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ శుక్రవారం ప్రారంభించారు. పోటీలో గెలుపొందిన జట్లకు నగదు బహుమతులు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిక్కి సత్తియ్య, పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, మడదా రాంబాబు, తాతీలు, కారే తాతాజీ, దేవుడు, నాగరాజు, పిక్కి స్వామి పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించిన ప్రగడ

మునగపాక, ఫిబ్రవరి 16: మండలంలోని నాగులాపల్లిలో శనివారం నుంచి జరగనున్న యువగళం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల క్రీడా ప్రాంగణాన్ని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం బైక్ ర్యాలీ, నాయకులతో సమావేశం ఏర్పాట్ల గురించి టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శరగడం యోగి నాగేశ్వరరావు, పొలమరశెట్టి మురళీ, నూకాలయ్య గోసాల గోవింద, పి. రాజునాయుడు, భీమిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 16: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని పాల్మన్‌పేటలో శుక్రవారం సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ల భవనాలు, వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ, పాయకరావుపేట పట్టణ వైసీపీ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో సామూహిక సూర్య నమస్కారాలు

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి సందర్భంగా తుమ్మపాలలో యోగా లైఫ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. 108 పర్యాయాలు సూర్యభగవానునికి నమస్కారాలు చేస్తూ యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో యోగా లైఫ్ సెంటర్ నిర్వాహకులు కరణం బాబురావు, యోగా శిక్షకులు కరణం రమాదేవి, కరణం దేవిక, మహాలక్ష్మి, టి. మణికంఠ పాల్గొన్నారు.

బౌద్ధ మహా సమ్మేళనం కరపత్రాల ఆవిష్కరణ

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి 11వ బౌద్ధ మహా సమ్మేళనం కరపత్రాలను శుక్రవారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 25న విశాఖలోని అంబేడ్కర్ భవన్‌లో బౌద్ధ మహా సమ్మేళనం జరగనుందని, ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిద్దార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో వైభవంగా దేవతమ్మ పండగ

మునగపాక, ఫిబ్రవరి 16: మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం మళ్లవారి దేవతమ్మ పండగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవతమ్మకు పూజలు నిర్వహించారు. మేళతాళాలు, సేవ గరడీలు, కోలాటాలు, కేరళ డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

మెగా ఫ్యామిలీ ఆత్మీయ సమావేశం రేపు

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని న్యూకాలనీలో ఉన్న రోటరీ కల్యాణ మండపంలో ఈనెల 18న మెగా ఫ్యామిలీ ఆత్మీయ సమావేశం జరగనుందని అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ ఉపాధ్యక్షుడు గల్లా కొండలరావు, రామ్‌చరణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మళ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు స్వామినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అభిమానులు శ్రీరామదాసు గోవింద, తాడి రామకృష్ణ, కొణతాల శ్రీను, బొడ్డేడ శ్రీను, టీవీకే కుమార్ పాల్గొన్నారు.

కోర్టు తీర్పుతో కుట్ర బయటపడింది : ప్రగడ

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 16 : రాజధాని ఫైల్స్ సినిమాను ఎలాగైనా ప్రజల వద్దకు చేరకుండా ప్రయత్నించిన వైసీపీ నేతల కుట్ర కోర్టు తీర్పుతో విఫలమైందని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని విషయంలో సీఎం చేసిన విషప్రచారం, అమరావతి విధ్వంసంపై సినిమాలో కళ్లకు కట్టినట్టుగా చూపించారన్నారు. రైతులు, మహిళల పట్ల ఎంత దారుణంగా వ్యవహరించాడో ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు చేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శిలు రాజాన రమేష్, దూళి రంగనాయకులు, మండల అధ్యక్షులు జనపరెడ్డి నరసింగరావు, ఎంపీటీసీ సభ్యుడు నీరుకొండ నరసింగరావు, గొలగాని అప్పారావు, పుర్రే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతులు కరువాయె..!

- సాదాసీదాగా నర్సీపట్నం మండల సర్వసభ్య సమావేశం
- వేములపూడి, చెట్టుపల్లిలలో రోడ్డు గుంతలను ప్రస్తావించిన ఎంపీపీ
- పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 16 : సమస్యలపై ప్రశ్నించే గొంతులు లేక నర్సీపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన శుక్రవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టీడీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మతో పాటు ఎంపీటీసీ సభ్యులు హాజరు కాలేదు. కనీసం సభలో ఉన్న అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరిద్దరు మినహా మిగిలినవారు వారివారి పంచాయతీల్లో సమస్యలను ప్రస్తావించకపోవడం గమనార్హం. కేవలం అధికారులు ప్రగతి నివేదిక చదివితే విన్నారే తప్ప, గొంతెత్త లేకపోయారు. ముందుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లేశ్వరి తమ శాఖ ప్రగతిని వివరిస్తుండగా, అధికార పార్టీకి చెందిన ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు లేచి మాట్లాడారు. తమ గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా 120 ట్యాప్‌లు వేశారని, అవి పాడైపోయినా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోయారు. రానున్నది వేసవి కాలం కావడంతో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఇన్నం రత్నంలు మాట్లాడుతూ వేములపూడి, చెట్టుపల్లి ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు గతుకులు పడ్డాయని, వాటిని పూడ్చాలని అర్‌అండ్‌బీ అధికారులను కోరారు. మార్చి నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ఎంపీపీ తెలిపారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో తలుపులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో నలభై విద్యుత్ స్తంభాలను మార్చినట్టు ఏఈ పద్మనాభం తెలిపారు. అదనపు స్తంభాలు కావాలంటే పంచాయతీల ద్వారా నిధులు చెల్లిస్తే వేస్తామని చెప్పారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ జీకేఎస్ నాయుడు మాట్లాడుతూ మండలంలోని 14 జగనన్న ఇళ్ల కాలనీ లేవుట్లలో 1038 గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.జాన్‌లింకన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ


కొండలఅగ్రహారంలో అడవిరాజులబాబులు


ఎర్రవరం సమీపంలోని ఆలయం వద్ద సందడి

గొలుగొండ, ఫిబ్రవరి 16 : మండలంలోని పలు గ్రామాల్లో అడవిరాజులబాబు పండగ శుక్రవారం ఘనంగా జరిగింది. చీడిగుమ్మల, ఎర్రవరం, పోలవరం, ఎరకంపేట, జి.కొత్తూరు, జిల్లేడపూడి, కంఠారం, పెనరాడ గ్రామాలకు చెందిన భక్తులు మేళతాళాలతో చీడిగుమ్మల గ్రామం నుంచి ఎర్రవరం మీదుగా రాజులబాబు గుడికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కోలాహల వాతావరణం నెలకొంది. జడ్పీటీసీ సుర్ల వెంకటగిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు లెక్కల అప్పలనాయుడు తదితరులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

మాకవరపాలెం : కొండలఅగ్రహారంలో అడవిరాజులబాబు పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గ్రామస్థులంతా కలిసి దూరంగా పొలాల్లో ఉన్న అడవి రాజులబాబు విగ్రహాల వద్దకు వెళ్లి పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు.

'రైతులు లబ్ధి పొందేలా ప్రణాళికలు'



మాట్లాడుతున్న సలహా పరిశోధన సంచాలకులు డాక్టరు జగన్నాథరావు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 16 : గిరిజన, మైదాన ప్రాంతాల రైతులు లబ్ధి పొందే విధంగా ప్రణాళికలు రూపొందించడంతో పాటు ఎప్పటికప్పుడు వ్యవసాయ సాగుపై వారికి సూచనలు అందించాలని సలహా పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. శుక్రవారం కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఏడవ శాస్త్రీయ సలహా మండలి సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటిగా, పోటీని తట్టుకునేలా చేసి రైతుల జీవన ప్రమాణాలను మెరుగు పర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ముకుందరావు, కేవీకే కో-ఆర్డినేటర్ ఎస్.రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు ఎ.సౌజన్య, ఎస్.సత్తిబాబు, కిశోర్‌కుమార్, పి.బాబు అనకాపల్లి, విశాఖ జిల్లాల వ్యవసాయాధికారులు మోహన్‌రావు, అప్పలస్వామి, జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు, ఆత్మ పీడీ ఆశాదేవి, నాబార్డు ఏజీఎం సమంత్‌కుమార్, సీఎంఎఫ్ఆర్ఐ, ఐసీఎఆర్ ప్రతినిధి ఎస్.ఎస్.రాజు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

... 5వ పేజీ తరువాయి

మునిసిపల్ అధికారులు మూడో నోటీసు వరకు అవకాశం ఇచ్చి కోర్టుకు వెళ్లడానికి అవకాశం కల్పిస్తున్నారు.

అక్రమ నిర్మాణానికి ఆస్తి పన్ను, విద్యుత్ మీటర్లు

నర్సీపట్నం క్లబ్ ఆవరణలో మెయిన్ రోడ్డును ఆనుకొని గత ఏడాదిఅనుమతులు లేకుండా రెండు అంతస్థులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఈ విషయం మునిసిపల్ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోలేదు. అక్రమ నిర్మాణంపై ఫైనల్ నోటీసు ఇచ్చి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసి చేతులు దులుపుకున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వకూడదు. కానీ మీటర్లు మంజూరు చేశారు. అదే విధంగా ఆస్తి పన్ను విధించకూడదు. గ్రామ కంఠం స్థలంలోని అక్రమ నిర్మాణానికి ఆస్తి పన్ను విధించడం గమనార్హం. దీనిపై మునిసిపల్ రెవెన్యూ అధికారి జి.లక్ష్మిని వివరణ కోరాగా... నర్సీపట్నం క్లబ్ నిర్వాహకులు నిర్మించిన షాపులు ప్రభుత్వ స్థలంలో ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని, పన్ను మదింపు చేయకూడదని అన్నారు. తాను రెండు నెలలు సెలవులో ఉన్నప్పుడు ఆస్తి పన్ను మదింపు చేశారని ఆమె తెలిపారు.

న్యాయ పోరాటం చేస్తాను



నర్సీపట్నం క్లబ్ స్థలంలో భవనాల నిర్మాణపై సమాచారం కోసం గతంలో మునిసిపల్ అధికారులకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశాను. నర్సీపట్నం క్లబ్ ప్రభుత్వ స్థలంలో ఉన్నట్టు సమాధానం ఇచ్చారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మించడంపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. విద్యుత్ మీటర్లు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఈపీడీసీఎల్ ఏఈకి చెప్పాను. అయినా విద్యుత్ మీటర్లు ఇచ్చారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతున్నదని సమాధానం ఇచ్చిన మునిసిపల్ అధికారులే... దానికి ఆస్తి పన్ను మదింపు చేయడం విడ్డూరంగా ఉంది. ఇప్పుడు మళ్లీ అదే స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. హైకోర్టులో కేసు వేసి న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాను.

- పాకలపాటి అరవింద్ కుమార్‌రాజు, సామాజిక కార్యకర్త, నర్సీపట్నం

కార్మిక, కర్షక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- కార్పొరేట్ సేవలో తరిస్తున్న ప్రధాని మోదీ ప్రభుత్వానికి ప్రజలంతా ఓటుతో బుద్ధి చెప్పాలి
- పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి
- రైతు రుణమాఫీ అమలు చేసి, నల్ల చట్టాలు రద్దు చేయాలి
- దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌లో వామపక్షాలతో పాటు రైతు, ప్రజా సంఘాల నాయకుల పిలుపు


దేవరాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాలు




చోడవరం, మాడుగులలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వామపక్ష శ్రేణులు

చోడవరం, ఫిబ్రవరి 16 : రైతులకు, కార్మికులకు అన్యాయం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కర్షక కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా పట్టణంలో రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ జరిపి, కొత్తూరు జంక్షన్‌లో రాస్తారోకో చేపట్టారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగంలో తీసుకుని వచ్చిన నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన పోరాటాన్ని బీజేపీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, వ్యవసాయరంగంలో తీసుకుని వచ్చిన నల్లచట్టాలు రద్దు చేయాలని, రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లాఅధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌వీ నాయుడు, సీపీ ఐఎంఎల్ లిబరేషన్ మండల కార్యదర్శి సవరాల గణేశ్, ఆటో యూనియన్, పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు విస్సారపు నాగూరు, సీతా హరిబాబు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రావికమతం : బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అంతా తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.సత్యవతి పిలుపు నిచ్చారు. శుక్రవారం ఇక్కడ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ వేస్తుందని మండిపడ్డారు. కె.గోవిందరావు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మెలో భాగంగా వామపక్ష పార్టీలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీబీఎం కాంపౌండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్ కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దగా చేసిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు పెంచేసి ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. అంబానీ, అదానీల కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచి పెడుతుందని ఆరోపించారు. రైతులు, కార్మికుల హక్కులను కాలరాస్తుందని బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, ఉపాధ్యక్షుడు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి, గురుబాబు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని అంతా ఇంటికి సాగనంపాలని సీఐటీయూ మండల నాయకుడు ఇరట నర్సింహమూర్తి పిలుపునిచ్చారు. దేశవ్యాప్త గ్రామీణ శ్రామిక బంద్‌లో భాగంగా శుక్రవారం మాడుగులలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. మోదీ పాలనలో సామాన్య, మధ్యతరగతి బతుకులు దుర్భరంగా మారాయన్నారు. కార్పొరేట్ సేవలో తరలిస్తున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో అంతా ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కొండాజీ, సరోజిని, ఉమాదేవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేశవ్యాప్త గ్రామీణ శ్రామిక బంద్‌లో భాగంగా శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇక్కడ రాస్తారోకో నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్మిక, కర్షక హక్కులను కాలరాస్తుందని సంఘాల నాయకులు మండిపడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, కార్యదర్శి బి.టి.దొర, సీపీఐ నాయకులు కన్నబాబు, కాగిత సూరిబాబు, వరలక్ష్మి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : రైతులు, కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కె.కోటపాడులో వామపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు వేచలపు కాసు బాబు, గొర్లె దేవుడుబాబు మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, రూ.రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని, గృహావసరాలకు, దుకాణాలకు, వ్యవసాయ రంగానికి 300 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. సీపీఎం నాయకులు గండి నాయనబాబు, ముత్యాలనాయుడు, ముత్యాలనాయుడు, సీమునిరి రామునాయుడు, రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు

- లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేయండి
- టీడీపీ శ్రేణుల సమావేశంలో నాయకులు పిలుపు


వడ్డాది సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు


పెదనందిపల్లి విలేకరుల సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 16 : వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, జగన్ పాలనపై ఏ వర్గమూ సంతృప్తిగా లేదని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. తురకలపూడి, వడ్డాదిలలో శుక్రవారం జరిగిన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లుగా మూడు రాజధానుల జపం చేసిన వైసీపీ సర్కారు, ఇప్పుడు నాలుగో రాజధాని పేరు ప్రస్తావిస్తోందని విమర్శించారు. జగన్ రెడ్డి ఇప్పుడు రైతులంటే భయపడిపోతున్నారని, రాజధాని ఫైల్స్ సినిమా అంటే హడలిపోతున్నారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర భవిష్యత్తు, యువత భవిష్యత్తు దెబ్బ తిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు యువత ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, కోరుకొండ రవికుమార్, ఎంవీవీ సత్యనారాయణ, వియ్యపు అప్పారావు, మలిరెడ్డి బుజ్జి, మరిసా సతీశ్, వజ్రపు శ్రీను, ఎంవీవీ తాతయ్యలు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, టీడీపీ జాతీయ అధ్యక్షులు లోకేశ్ శంఖారావం సభలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నట్టు తాతయ్యబాబు తెలిపారు. తొలుత ఈ నెల 20వ తేదీగా నిర్ణయించగా, తాజాగా 19వ తేదీ మధ్యాహ్నానికి షెడ్యూల్ మారిందన్నారు. వడ్డాది జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతా పెద్ద సంఖ్యలో తరలి రావాల్సిందిగా ఆయన కోరారు.

'హైకోర్టు తీర్పు జగన్‌కు చెంపపెట్టు'

చోడవరం : రాజధాని ఫైల్స్ సినిమా విడుదలకు అన్నిరకాల అడ్డంకులు సృష్టించిన సైకో సీఎంకు హైకోర్టు తీర్పు చెంపపెట్టని టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతిని నమ్మి భూములిచ్చిన అన్నదాతలను దెబ్బతీసి, మూడు రాజధానుల పేరిట జగన్ రాష్ట్రాన్ని ఏ విధంగా నాశనం చేశారో రాజధాని ఫైల్స్‌లో పూర్తిగా విశదీకరించారన్నారు. ఇది సినిమా కాదని, అన్నదాతల ఆక్రందన, రాష్ట్ర ప్రజల మనోవేదన ఇందులో దాగి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ వైస్ ఎంపీపీ భూతనాథు నానికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, గూనూరు పెద అచ్చిబాబు, తెలుగుయువత నాయకుడు సిరిగిరిశెట్టి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసీపీని రానున్న ఎన్నికల్లో సమష్టి కృషితో అంతా తరిమికొట్టాలని టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఎస్.గజపతినగరం, వజ్రపాలెం, ఎం.అమండ, పెదనందిపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పాదయాత్రల్లో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, వై.కరుణాకరరావు, చెరకాన సూరిబాబు, పోతల పాత్రునాయుడు, రామలింగస్వామి, సోమిరెడ్డి గోవింద, సత్యారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ శంఖారావం సభను అంతా విజయవంతం చేయాల ఆ పార్టీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ నిర్వహించిన పార్టీ మండలస్థాయి సమావేశంలో మాట్లాడారు. నాయకులు బుద్దాల రమణ, ఉండూరు దేముడు, పుప్పాల రమేష్, లెక్కల కాశిబాబు, నందారపు సన్యాసిరావు, కొట్యాడ మల్లికార్జునరావు, మరువాడ ఈశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు శివాజీ, రొబ్బా మహేష్, దాసరి అచ్యుతరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : టీడీపీ నాయకుడు లోకేశ్ నిర్వహిస్తున్న శంఖారావం సభను అన్నివర్గాల ప్రజలు విజయవంతం చేయాలని ఆ పార్టీ కె.కోటపాడు మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ పిలుపునిచ్చారు. మేడిచర్లలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు పూడి నారాయణమూర్తి, పూడి శ్రీను, బొడ్డు అక్కునాయుడు, పూడి నరేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం, ఫిబ్రవరి 16 : రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పట్టణంలోని అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు విద్యుత్ స్తంభాల తొలగింపు, కొత్త లైన్ వేసే నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈఈ సత్యానందం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం ఇండోర్ సబ్ స్టేషన్ వద్ద గల శ్రీదుర్గామల్లేశ్వరస్వామి గుడి ఫీడర్ పరిధిలోని రామారావుపేట, వెంకునాయుడుపేటలలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జాబ్‌మేళాలో 185 మంది ఎంపిక


ఇంటర్వ్యూను పరిశీలిస్తున్న నైపుణ్యాభివృద్ధి అధికారి

నర్సీపట్నం, ఫిబ్రవరి 16 : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడి ఎంఎల్ఎఎస్ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం14 కంపెనీలలో ఉపాధి కల్పనకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 425 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 185 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చాముండేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏఎస్ కళాశాల చైర్మన్ మీసాల సుబ్బన్న, కరస్పాండెంట్ మీసాల లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

21న చోడవరంలో మెగా జాబ్‌మేళా

చోడవరం, ఫిబ్రవరి 16 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ తెలిపారు. మైక్రోసాఫ్ట్ కంపెనీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మేళాలో పది కంపెనీలు పాల్గొంటున్నాయని, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత పొందినవారు అర్హులుగా పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 77806 88683 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా సౌకర్యాలు

గొలుగొండ, ఫిబ్రవరి 16 : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జి.ప్రభాకర్‌రాజు శుక్రవారం పరిశీలించారు. పాతమల్లంపేట, జోగంపేట, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలకు వెళ్లి సౌకర్యాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను పక్కాగా కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తూటిపాల పాఠశాల విద్యార్థుల పెద్దమనసు

మాకవరపాలెం, ఫిబ్రవరి 16 : తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రులు లేని ఇద్దరు విద్యార్థులకు తోటి విద్యార్థులు శుక్రవారం సాయం అందించి వారి గొప్ప మనసును చాటుకున్నారు. ఇక్కడ చదువుతున్న దినేష్, హిమజయలకు పది కిలోల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల తొలి సమితి అధ్యక్షునికి నివాళి


చంద్రమ్మదొర విగ్రహానికి నాయకుల నివాళి

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 16 : వీరవిల్లి అగ్రహారంలోని పెట్రోల్ బంక్ సమీపంలో గల మాడుగుల తొలి సమితి అధ్యక్షుడు దొండా చంద్రమ్మదొర విగ్రహం వద్ద శుక్రవారం ఆయన పేరిట తీర్థాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, ఆయన సతీమణి మాజీ జడ్పీటీసీ సరోజిని, మాడుగుల మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, వీరవిల్లి అగ్రహారం సర్పంచ్ ఎలగాడ కామలక్ష్మి తదితరులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం'

చీడికాడ, ఫిబ్రవరి 16 : గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి తెలిపారు. తురువోలు నుంచి చొక్కాకులవారి కల్లాలమీదుగా తంగుడుపల్లి గ్రామానికి నిర్మించిన రోడ్డును శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ మట్టా అప్పారావు, ఉపసర్పంచ్ పి.టి.బాబు, నాయకులు లాలం శివకుమార్, చొక్కాకుల కోటేశ్వరరావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీపట్నంలో నీటి పథకం ప్రారంభం


నీటి పథకం ప్రారంభోత్సవంలో విప్ ధర్మశ్రీ

చోడవరం, ఫిబ్రవరి 16 : గౌరీపట్నం పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని విప్ ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం జల్ జీవన్ పథకంలో భాగంగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ కనకమ్మ, సర్పంచ్ కోన చంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు జగన్ పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణ కేంద్రం ప్రారంభం

దేవరాపల్లి, ఫిబ్రవరి 16 : పినకోట పీహెచ్‌సీలో టీబీ (క్షయ) నిర్ధారణ కేంద్రాన్ని క్షయ నివారణ ప్రత్యేకాధికారిణి డాక్టర్ సౌమ్య, పినకోట వైద్యాధికారి జి.వెంకటేష్ శుక్రవారం ప్రారంభించారు. ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవి, ఫార్మసిస్టు అశ్విని, ఎంపీహెచ్ఈవో గంగరాజు, సావిత్రి, తులసి, పుష్ప, సదానందం, ధనరాజ్, విజయ, బీమాలమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 16 : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా దృష్టిసారించాలని ఎంపీపీ రాజారామ్ వలంటీర్లకు సూచించారు. జాలంపల్లి, సత్యవరం, లోవ, పొన్నవోలులో గల వలంటీర్ల అవగాహన సదస్సు శుక్రవారం జమ్మాదేవిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. ఎంపీడీవో కాశీప్రసాద్, సర్పంచ్ కోసిరెడ్డి కృష్ణమూర్తి, ఎంపీటీసీ తలారి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

రోలుగుంట, ఫిబ్రవరి 16 : కుసర్లపూడి జడ్పీ పాఠశాలలో శుక్రవారం ఆర్వో ప్లాంట్‌ను సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు ప్రారంభించారు. హెచ్ఎం మోహన్‌రావు తదిత రులు పాల్గొన్నారు.

మేడిచర్లలో ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు, ఫిబ్రవరి 16 : మేడిచర్లలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిదంపతులకు వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు, సర్పంచ్ పూడి నారాయణమూర్తి, తదితరులు దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు


సూర్యనారాయణస్వామి ఆలయంలో భక్తులు

కె.కోటపాడు, ఫిబ్రవరి 16 : రథసప్తమి సందర్భంగా మండలంలోని ఆర్.వై.అగ్రహారంలో గల సూర్యనారాయణమూర్తి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తుల రాక ఆరంభమైంది. అర్చ కులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. సర్పంచ్ కన్నూరు లక్ష్మీనాగభూషణం, యడ్ల బల రాం, పోతుబాబు, ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌరీశ్వరాలయంలో రాటోత్సవం

చోడవరం, ఫిబ్రవరి 16 : పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి శుక్రవారం రాటను వేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్యనారాయణ మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆలయ ఈవో సత్యనారాయణ, అర్చకులు కొడమంచిలి చలపతి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

20న మల్లికార్జున స్వామి కల్యాణం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 16 : వడ్డాదిలో భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి కల్యాణం ఈనెల 20న జరగనుంది. ఇందుకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం పల్లకీసేవ, రాత్రి ఎనిమిది గంటలకు స్వామి వారి కల్యాణం జరపనున్నామని ఆలయ ఈవో శర్మ తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

రోలుగుంట, ఫిబ్రవరి 16 : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవిచంద్ర సూచించారు. రోలుగుంట గ్రామ సచివాలయంలో ఓటు హక్కు ప్రాధాన్యంపై శుక్రవారం ఏర్పాటైన సభలో మాట్లాడారు. డీటీ అప్పారావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

చీడికాడ, ఫిబ్రవరి 16 : బైలపూడిలో 260 మంది పాడి రైతులకు విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షులు జాజిమొగ్గల నాగరాజు, డివిజన్ మేనేజర్ రాము పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 16 : ముకుందపురంలో ఆంజనేయ తీర్థాన్ని శుక్రవారం నిర్వహించారు. వేకువజాము నుంచి పూజలు జరిపారు. టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కమిటీ చైర్మన్ కర్రి వరహాలరాజు, మాలిబాబు, శ్రీను పాల్గొన్నారు.

మేడివాడలో ఎడ్లబండ్ల పరుగు పోటీలు

రావికమతం, ఫిబ్రవరి 16 : టి.అర్జాపురం, మేడివాడ గ్రామాల్లో శుక్రవారం భక్తాంజనేయస్వామి తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, అర్జాపురం సర్పంచ్ మడగల ఫాల్గుణ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. మేడవాడలో జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పరుగు, వాలీబాల్ పోటీలను నిర్వహించారు.

310 మందికి వైద్య పరీక్షలు


రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

చీడికాడ, ఫిబ్రవరి 16 : కోనాం గిరిజన ఆశ్రమోన్నత బాలుర పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కోనాం, మంచాల పంచాయతీల నుంచి వచ్చిన 300 మంది రోగులకు వైద్యాధికారి సునీల్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు వైద్యులు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ లాలం శారదా వరలక్ష్మి, ఎంపీడీవో ఉమామహేశ్వరి, వైస్ ఎంపీపీ చిన్నమ్మలు, సర్పంచ్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులకు సోషల్ ఆడిట్

మాకవరపాలెం,ఫిబ్రవరి 16 : ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి శుక్రవారం నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జాన్ లింకన్ తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి చేసిన పనులపై ఆరా తీసి, సమావేశం నిర్వహిస్తారన్నారు.

తలనీలాలు, కొబ్బరి చెక్కలకు వేలం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 16 : వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువుదీరిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కలు, తలనీలాలుకు సంబంధించి శనివారం వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శర్మ తెలిపారు.